క్లుప్తంగా

రహదారుల నిర్మాణానికి చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి

ఏలేశ్వరం: మండల వ్యాప్తంగా పూర్తిస్థాయిలో రహదారుల నిర్మాణం చేపట్టనున్నట్టు ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం ఆయన అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ మండలంలో సీసీ, బీటీ రోడ్ల నిర్మాణానికి రూ.4.18 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. దీనిలో రూ.2.13 కోట్లతో బీటీ రోడ్లు, రూ.2.05 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణం చేపడతామన్నారు. రహదారుల నిర్మాణంతో ప్రజల సమస్యలు తీరుతాయన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సభ్యుడు జ్యోతుల పెద బాబు, సూతి బూరయ్య పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన



జి.కొత్తపల్లిలో రోగులకు పరీక్షలు చేస్తున్న వైద్యురాలు సామ్యశ్రీ

శంఖవరం: డెంగీ వ్యాధి కారణంగానే ప్లేట్ లెట్స్ తగ్గి పోతాయని పి.మల్లాపురం పీహెచ్‌సీ వైద్యాధికారి సామ్యశ్రీ తెలిపారు. మండలంలోని జి.కొత్తపల్లిలో ప్రజలకు గురువారం సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏడిస్ దోమ కుట్టడం వలన డెంగీ వస్తుందని, ఈ దోమ పగటి పూట కుడుతుందన్నారు. డెంగీ వ్యాధికి ప్రత్యేక చికిత్స అంటూ ఏమి లేదన్నారు. లక్షణాలకనుగుణంగా చికిత్స పొందాలన్నారు. ఒళ్లు నొప్పులు, కాళ్లు లాగడం, వాంతులు, చలి జ్వరం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రుణాలను సద్వినియోగం చేసుకోవాలి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎంపీడీఓ సాయినవీన్

తుని రూరల్: స్వయం ఉపాధి రుణాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ కె.సాయినవీన్ సూచించారు. తుని మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీపీ డాక్టర్ బొప్పన రాము అధ్యక్షతన వివిధ కార్పొరేషన్ల రుణాలకు చేసిన దరఖాస్తుదారులకు, బ్యాంకర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ తీసుకున్న రుణాలతో యూనిట్లు ఏర్పాటు చేయాలని, ఆయా యూనిట్లతో జీవనోపాధి పొందాలన్నారు. స్వయం ఉపాధి పొందుతూ రుణాలను తిరిగి సకాలంలో చెల్లించాలన్నారు. యూనిట్లు మంజూరుతో లబ్ధిదారులకు అవసరమైన రుణాలను అందించి బ్యాంకర్లు సహకరించాలన్నారు. యూనిట్‌లో 50 శాతం రాయితీని ప్రభుత్వం అందిస్తుందని, మిగిలిన 50 శాతం బ్యాంకు రుణంగా ఇస్తుందని తెలిపారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ధర్మవరంలో బాధిత కుటుంబాన్ని వైఎస్సార్ సీపీ నాయకుడు, ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ ముదునూరి మురళీకృష్ణంరాజు గురువారం పరామర్శించి ఆర్థిక సహాయాన్ని అందజేశారు. గ్రామానికి చెందిన గొర్ల సుబ్బారావు కుమారుడు సత్తిబాబ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. వారి కుటుంబాన్ని మురళీరాజు పరామర్శించి ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రూ.5 వేలు ఆర్థిక సాయం అందజేశారు. అలాగే ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన గ్రామానికి చెందిన రాయుడు దొరబాబును మురళీరాజు పరామర్శించి ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు నానిపల్లి చంటి, కోలా తాతబాబు, జువ్వల దొరబాబు, పోకనాటి వెంకటేశ్వరరావు, దోమలంక బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

కిర్లంపూడి: స్థానిక భగవాన్ శ్రీసత్యసాయి బాబా సేవా కేంద్రంలో గురువారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. భగవాన్ సత్య సాయిబాబా శత జన్మోత్సవాల్లో భాగంగా సత్య సాయి సేవా సమితి, పరమహంస యోగానంద సొసైటీ ఆధ్వర్యంలో ఈ వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. స్థానిక, పరిసర గ్రామాలకు చెందిన 65 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు, కళ్లజోళ్లు పంపిణీ చేశారు.

పైప్‌లైన్‌కు మరమ్మతులు

అన్నవరం: పంపా నదీ గర్భంలోని బోర్ల నుంచి రత్నగిరికి నీటిని సరఫరా చేసే పైప్‌లైన్ నుంచి నీరు లీకవ్వడంతో గురువారం వాటర్ వర్క్స్ విభాగం సిబ్బంది మరమ్మతులు చేసి లీకేజీని అరికట్టారు. పంపా నదిలో నీటి నిల్వలు తక్కువ ఉండడంతో దేవస్థానంలో నీటి పొదుపు పాటిస్తున్న విషయం తెలిసిందే.

పోషణ.. ఆరోగ్యానికి రక్షణ

- సత్ఫలితాలను ఇస్తున్న పోషణ వాటికలు
- అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆకుకూరల సాగు
- పౌష్టికాహారంపై ప్రజలకు అవగాహన
- ధరలు పెరుగుతున్నా ఊరట



ఎస్.సూరవరంలో పోషణ వాటికకు నీరు పెడుతున్న అంగన్‌వాడీ వర్కర్

తుని రూరల్: కరోనా తర్వాత ప్రజలకు ఆరోగ్యంపై చైతన్యం పెరిగింది. సేంద్రియ పద్ధతుల్లో సాగు చేసిన ఉత్పత్తులకు డిమాండ్ పెరిగింది. కూరగాయల సాగు అంగన్‌వాడీ కేంద్రాలకు పాకింది. ఆరకొర మెనూ చార్జీలతో లబ్ధిదారులకు పౌష్టికాహారం అందించడం కష్టమవుతుంది. అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహిస్తున్న పోషణ వాటికలు (సాక్షం) పథకం సత్ఫలితాలు ఇస్తుండడంతో కొంతమేరకు ఆర్థిక భారం తగ్గి అంగన్‌వాడీలకు ఊరట లభిస్తోంది. అంగన్‌వాడీ కేంద్రాలకు అవసరమైన ఆకుకూరలు, ఇతరేతర కూరగాయలు పండిస్తుండడంతో వీటికి వెచ్చించాల్సిన ఖర్చులు ఆదా అవుతున్నాయని పలువురు అంగన్‌వాడీలు తెలిపారు. పోషణ వాటికల్లో పండించిన ఆకుకూరలు అంగన్‌వాడీ కేంద్రాల్లో వినియోగించడమే కాకుండా మిగులు ఆకుకూరలను గర్భిణులు, బాలింతలకు పంపిణీ చేస్తున్నారు. సేంద్రియ ఆహారంపై అవగాహన కల్పించడంలో భాగంగా ఉచితంగా అందిస్తున్నట్టు అంగన్‌వాడీ కార్యకర్తలు పేర్కొన్నారు.

314 అంగన్‌వాడీ కేంద్రాలు

తుని నియోజకవర్గంలోని మూడు మండలాలు, పట్టణంలో 314 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో 139 అంగన్‌వాడీ కేంద్రాలకు సొంతభవనాలు ఉండగా 175 అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. 116 అంగన్‌వాడీ కేంద్రాలకు ఖాళీ స్థలాలు ఉండడంతో ఆయా స్థలాల్లో పోషణ వాటికలు (సాక్షం) నిర్వహిస్తున్నారు.

తుని నియోజకవర్గంలో గర్భిణులు, బాలింతలు, చిన్నారులు, పోషణ వాటికల వివరాలు

మండలం	గర్భిణులు	బాలింతలు	మూడేళ్లలోపు పిల్లలు	3 నుంచి 6 ఏళ్ల పిల్లలు	పోషణ వాటికలు
తుని	433 మంది	522 మంది	2526 మంది	1650 మంది	47
తొండంగి	445 మంది	585 మంది	2862 మంది	1562 మంది	42
కోటనందూరు	167 మంది	247 మంది	1192 మంది	786 మంది	27
తుని పట్టణం	233 మంది	268 మంది	1545 మంది	1462 మంది	--
మొత్తం	1278 మంది	1622 మంది	8123 మంది	5460 మంది	116



పోషణ వాటికలో పండించిన ఆకుకూరలను లబ్ధిదారులకు అందజేస్తున్న కార్యకర్త

తాజా ఆకుకూరలతో భోజనం



మార్కెట్లో ఆకుకూరల ధరలు ఎక్కువగా ఉంటున్నాయి. దాంతో పాటు అవి రసాయనాలతో పండించినవి. పోషణ వాటికలో పండించిన ఆకుకూరలను తాజాగా సేకరించి వండి చిన్నారులకు పెడుతున్నాం. పిల్లలకు వినియోగించగా మిగిలిన ఆకుకూరలను లబ్ధిదారులైన గర్భిణులు, బాలింతలకు అందిస్తూ పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్నాం. – చల్లా గనిలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్త, కొలిమేరు

116 కేంద్రాల్లో పోషణ వాటికలు



సాక్షం పథకంలో భాగంగా 116 అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ వాటికలు ఏర్పాటు చేశాం. స్థల లభ్యతను బట్టి ఆకుకూరలు, వంగ, బెండ, మిరప, టమాటా మొక్కలతో పాటు అనబ పాదులు వేశారు. నిర్వహణ బాధ్యతలను ఆయాలకు అప్పగించాం. వాటికల్లో పండిన ఆకుకూరలను వండి చిన్నారులకు పౌష్టికాహారంగా అంగన్‌వాడీలు పెడుతున్నారు. నిరంతరం కొనసాగించేందుకు స్త్రీ శిశు సంక్షేమశాఖ సహకరిస్తుంది. – కె.శ్రీలత, ఐసీడీఎస్ సీడీపీఓ, తుని

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



ఏలూరులో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తున్న వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు

ప్రత్తిపాడు: మండలంలోని ఏలూరులో వేంచేసిన భూపాదాలమ్మ అమ్మవారి ఆలయ వార్షికోత్సవం గురువారం వైభవంగా జరిగింది. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన అన్నసమారాధనలో ముద్రగడ పాల్గొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు కొట్టేటి రాయుడు, దాడిశెట్టి గోపి, కొట్టేడి నాని, దాడిశెట్టి వీరబాబు, దాడిశెట్టి నూకాపతి పాల్గొన్నారు.

ప్రకృతి సాగుతో రైతులకు మేలు

గండేపల్లి: ప్రకృతి వ్యవసాయంతో రైతులకు మేలు జరుగుతుందని రాష్ట్ర ప్రకృతి వ్యవసాయ సిబ్బంది కె.మహేష్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏఓ సద్గురుమూర్తి అధ్యక్షతన గురువారం 2025–26 ఖరీఫ్ ప్రణాళికపై సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంపై రైతులు దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కో–ఆర్డినేటర్ వై.గణేష్, మాస్టర్ ట్రైనర్ భాస్కరరావు, రమ్య, వ్యవసాయ, ఉద్యాన సహాయకులు, ఐసీఆర్పీలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు ముగిసిన శిక్షణ



రౌతులపూడిలో అంగనవాడీ టీచర్లకు శిక్షణ ఇస్తున్న సీడీపీఓ పద్మావతి

రౌతులపూడి: మండలంలోని అంగన్‌వాడీ సిబ్బందికి మూడు రోజుల పాటు నిర్వహించిన శిక్షణా తరగతులు గురువారంతో ముగిశాయి. శంఖవరం ఐసీడీఎస్ సీడీపీఓ టీడీఆర్ పద్మావతి ఆధ్వర్యంలో మిషన్ పోషణ్–2.0, సాక్ష్యం కార్యక్రమంలో భాగంగా పోషణ్–బి, పడాయి–బి కార్యక్రమాలపై శిక్షణ ఇచ్చారు. చిన్నారులకు అందించే విద్యాబోధనలో నాణ్యతను పెంచేందుకు ఈ శిక్షణ దోహదపడతుందని సీడీపీఓ తెలిపారు. బాలల విద్య ప్రాముఖ్యత, సృజనాత్మకత, అక్షరాస్యతాభివృద్ధి, ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ప్రత్యేక కార్యచరణ రూపొందించి అభివృద్ధి చేయటం, పోషకాహారం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కత్తిపూడి సెక్టార్ ఐసీడీఎస్ విస్తరణాధికారి రజని, అంగనవాడీ టీచర్లు రత్నకుమారి, సత్యవేణి, వెంకటలక్ష్మి, పద్మ, మమత, తదితరులు పాల్గొన్నారు.

నేడు సామాజిక తనిఖీ ప్రజావేదిక

గండేపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం సామాజిక తనిఖీ ప్రజా వేదిక నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ నాతి బుజ్జి తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు జరిగే ప్రజావేదికలో గతేడాది జరిగిన ఉపాధి పనుల నివేదికను తనిఖీ చేస్తారని తెలిపారు.

సర్పంచ్ లక్ష్మికి దాడిశెట్టి రాజా పరామర్శ



బొద్దవరంలో సర్పంచ్ వేగి లక్ష్మిని పరామర్శిస్తున్న దాడిశెట్టి రాజా

కోటనందూరు: బొద్దవరం సర్పంచ్ వేగి లక్ష్మి అనారోగ్యంతో బాధపడుతున్నారు. మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజా గురువారం సర్పంచ్ వేగి లక్ష్మి స్వగృహానికి వెళ్లి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని ధైర్యం చెప్పారు. ఎంపీపీ లగుడు శ్రీనివాసు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనరు చింతకాయల చినబాబు, వాణిజ్య విభాగం తుని నియోజకవర్గ కన్వీనర్ వెలగా వెంకట కృష్ణాజీ, వైస్సార్ సీపీ నాయకులు గొర్లి రామచంద్రరావు, లెక్కల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

పాస్టర్ ప్రవీణ్ మృతిపై విచారణ చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న మండల ఫెలోషిప్ అధ్యక్షుడు పాల్‌ప్రసాద్

ఏలేశ్వరం: పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై ప్రభుత్వం పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి నిజనిర్ధారణ చేయాలని మండల పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు కె.పాల్‌ప్రసాద్ కోరారు. స్థానిక బెరాకా ప్రార్థన మందిరంలో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పాల్‌ప్రసాద్ మాట్లాడుతూ పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతి క్రైస్తవులకు తీరని లోటు అన్నారు. ఆయన మృతిపై తమకు అనుమానాలు ఉన్నాయని, ప్రభుత్వం విచారణ చేపట్టాలన్నారు. సోషల్ మీడియాలో క్రైస్తవులపై అసభ్యకర పోస్టులు పెడుతున్న వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఫెలోషిప్ ప్రతినిధులు జాన్ విల్సన్‌బాబు, ఎలైజా, ఏబీవీ ప్రసాద్, సంపత్ ప్రభుదాస్ తదితరులు పాల్గొన్నారు.

రహదారుల నిర్మాణానికి రూ.5.97 కోట్లు

రౌతులపూడి: మండలంలోని లింకు రోడ్లు నిర్మాణానికి ఉపాధి హామీ పథకంలో రూ.5.97 కోట్లు మంజూరయ్యాయని పంచాయతీ రాజ్ జేఈ మురళి గురువారం తెలిపారు. మండలంలోని రాజవరం–గంగవరం బీటీ రహదారి నిర్మాణానికి రూ.60 లక్షలు, రాజవరం–దిగువశివాడ రోడ్డు నిర్మాణానికి రూ.కోటి, బీబీ పట్నం–లచ్చిరెడ్డిపాలెం రోడ్డుకు రూ.92 లక్షలు, లచ్చిరెడ్డిపాలెం–ఎస్ఎన్ పట్నం రోడ్డుకు రూ.2.60 కోట్లు మంజూరయ్యాయని వివరించారు. అలాగే మండలంలోని పలు సీసీ రోడ్ల నిర్మాణాలకు మరో రూ.85 లక్షలు మంజూరయ్యాయని తెలిపారు. ప్రభుత్వ నుంచి ఉత్తర్వులు వచ్చిన వెంటనే రోడ్ల నిర్మాణాలు చేపడతామని చెప్పారు.

నిధుల మంజూరుపై హర్షం

మండలంలోని పలు రహదారుల నిర్మాణాలకు నిధులు మంజూరు కావటంపై టీడీపీ మండల అధ్యక్షుడు తమరాన సత్యనారాయణ, వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ పైల సాంబశివరావు, స్థానిక నేతలు లాలం అప్పలనాయుడు, నల్లమిల్లి రవి, పైల రామకృష్ణ, పంచాడ బుజ్జి తదితరులు హర్షం వ్యక్తం చేశారు. నిధులు మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యే సత్యప్రభకు కృతజ్ఞతలు తెలిపారు.

దొండవాక ఉపసర్పంచ్‌గా సత్యనారాయణ



దొండవాక ఉపసర్పంచ్ సత్యనారాయణను అభినందిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



మల్లవరంలో ఉపసర్పంచ్ ప్రసన్నకు ధ్రువీకరణ పత్రాన్ని అందజేస్తున్న ఎన్నికల అధికారి

తుని రూరల్: మండలంలోని దొండవాక ఉపసర్పంచ్‌గా ఎనిమిదో వార్డు మెంబర్ ఆదాడ సత్యనారాయణ గెలుపొందినట్టు ఎన్నికల అధికారి ఇ.మార్కెండేశ్వరరావు ప్రకటించారు. గతంలో ఎన్నికైన ఉపసర్పంచ్ మామిడిశెట్టి మంగ తన పదవికి రాజీనామా చేయడంతో ఏర్పడిన ఖాళీని భర్తీ చేసేందుకు గురువారం పంచాయతీ కార్యాలయంలో ఉపసర్పంచ్ ఎన్నిక నిర్వహించారు. ఎన్నికల అధికారి ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు. సత్యనారాయణ ఉపసర్పంచ్‌గా గెలుపొందడంతో వైఎస్సార్ సీపీ తన ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. ఉపసర్పంచ్‌గా ఎన్నికైన సత్యనారాయణను వైఎస్సార్ సీపీ నాయకులు లంక సత్యనారాయణ, లంక తాతీలు, ఆదాడ అప్పారావు, మాదాసు దేవుడు, జగన్నాథం గోవిందు, కొల్లుమళ్ల శివ, కడిమి సత్యనారాయణ, బూరీ రంగా తదితరులు అభినందించారు.

మల్లవరం ఉపసర్పంచ్‌గా లంక ప్రసన్న ఎంపిక

గోకవరం: మండలంలోని మల్లవరం ఉపసర్పంచ్‌గా లంక ప్రసన్న ఎన్నికయ్యారు. ఇటీవల ఉపసర్పంచ్ పదవికి రాజీనామా చేయడంతో గురువారం ఈఓపీఆర్‌డీ రాజేశ్వరరావు ఎన్నికల అధికారిగా ఉపసర్పంచ్ ఎన్నిక నిర్వహించారు. 14 మంది వార్డు సభ్యులకుగాను తొమ్మిది మంది వార్డు సభ్యులు, సర్పంచ్ హాజరయ్యారు. దీనిలో భాగంగా ఆరో వార్డు సభ్యురాలు లంకా ప్రసన్నను సభ్యులు ఉపసర్పంచ్‌గా ఎన్నుకున్నారు. ఉపసర్పంచ్ ఎన్నిక సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్సై పవన్‌కుమార్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

పైడికొండ ఉపసర్పంచ్‌గా ఊటకోటి సత్యవతి

తొండంగి: మండలంలోని పైడికొండ ఉపసర్పంచ్‌గా ఊటకోటి సత్యవతి ఎన్నికైనట్టు ఎన్నికల ప్రిసైడింగ్ అధికారి, తుని ఈవోపీఆర్‌ఆర్డీ గుడివాడ.మరిడియ్య గురువారం తెలిపారు. రాష్ట్ర ఎన్నికల అధికారుల ఆదేశాల మేరకు పంచాయతీ కార్యాలయంలో ఉపసర్పంచ్ ఎన్నిక నిర్వహించగా 12 మంది సభ్యులకు గానూ ఎనిమిది మంది హాజరయ్యారన్నారు. వారంతా పంచాయతీలో 11 వార్డు మెంబర్ ఊటకోటి సత్యవతిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారన్నారు. ఈ మేరకు ఉపసర్పంచ్ ఎన్నికపత్రాన్ని అందించారు.

కొత్త అమావాస్య వేడుకలకు ముస్తాబు





కిర్లంపూడిలో నూకాలమ్మ ఆలయం వద్ద ఏర్పాట్లు. (అంతర చిత్రం) నూకాలమ్మ అమ్మవారు

కిర్లంపూడి: కొత్త అమావాస్యను పురస్కరించుకుని కిర్లంపూడి వేంచేసిన నూకాలమ్మ అమ్మవారి ఆలయాన్ని సుందరంగా ముస్తాబు చేశారు. అమ్మవారి జాతర మహోత్సవాల్లో భాగంగా గత నెల రోజులుగా గ్రామ వీధుల్లో గరగ నృత్యాలతో ఊరేగింపు నిర్వహించారు. శుక్రవారం రాత్రి నుంచి ఆలయం వద్ద జాతర ప్రారంభం కానుండడంతో ఆలయం వద్ద చలువ పందిరి వేసి, విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. ఐదు రోజుల పాటు తీర్థం నిర్వహించనున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయం వద్ద ఏర్పాట్లు చేసినట్టు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

అమ్మవారికి సారె సమర్పణ

కిర్లంపూడిలో వేంచేసిన కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నూకాలమ్మతల్లికి గురువారం సాయంత్రం చీర, సారె సమర్పించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

పాండవులపాలెంలో భూ సమస్య పరిష్కారం



పాండవులపాలెంలో భూ సమస్యను పరిష్కరిస్తున్న అధికారులు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని పాండవులపాలెంలో ఇరువర్గాల మధ్య నెలకొన్న భూ సమస్యను గురువారం పోలీసు, రెవెన్యూ అధికారులు పరిష్కరించారు. గత మంగళవారం గ్రామానికి చెందిన ఇరటా లక్ష్మ స్థానిక టీడీపీ కార్యకర్తలు అడ్డాల వీరన్న, అడ్డాల సూర్యారావు తన పొలంలోకి వెళ్లకుండా అడ్డుకుంటున్నారని మీడియా ముఖంగా ఆవేదన వ్యక్తం చేస్తూ వీడియోను విడుదల చేశారు. దీనిపై ప్రత్తిపాడు సీఐ బి.సూర్య అప్పారావు ఆదేశాల మేరకు స్థానిక ఏఎస్సై సత్యనారాయణ, కానిస్టేబుల్ రవి, వీఆర్వోలు పి.దేవుడు, ఎన్.సత్యనారాయణ గురువారం గ్రామంలో స్థానిక పెద్దల సమక్షంలో ఇరువర్గాల వారితో పంచాయితీ నిర్వహించారు. అనంతరం పొలంలోకి వెళ్లి పరిస్థితి పరిశీలించారు. ఇరు వర్గాలకు ఇబ్బంది లేకుండా పొలంలోకి వెళ్లేందుకు ప్రత్యామ్నాయంగా మరో మార్గాన్ని అధికారులు సూచించారు. దీనికి ఇరువురు అంగీకరించడంతో సమస్య పరిష్కారమైంది. సమస్యను పరిష్కరించిన అధికారులకు ఇరువర్గాల వారు కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్టీసీ డీఎం సుచరితకు అభినందనలు



డిపో మేనేజర్ సుచరితకు పుష్పగుచ్ఛం అందిస్తున్న వైఎస్సార్ అసోసియేషన్ నాయకులు

గోకవరం: స్థానిక ఆర్టీసీ డిపో నూతన మేనేజర్ సుచరిత మార్గరేట్‌కు ఆర్టీసీ వైఎస్సార్ ఎంప్లాయీస్ అసోసియేషన్ నాయకులు అభినందనలు తెలిపారు. డిపో కార్యాలయంలో గురువారం డీఎం సుచరితకు పుష్పగుచ్ఛాలు అందించారు. ఈ సందర్భంగా డిపోలో ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆమెకు వివరించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి, డిపో ఆర్థిక పురోగతి సాధించడానికి సిబ్బంది కృషి చేయాలని డీఎం ఆకాంక్షించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ అడ్డాల అప్పారావు, వైఎస్సార్ యూనియన్ ప్రెసిడెంట్ బంగారయ్య, కార్యదర్శి ఎస్ఎస్ బాబు, నాయకులు బాబూరావు, బొచ్చు ప్రసాద్, ఎంకేడీ ప్రసాద్, సీహెచ్ఎస్ఎన్ రెడ్డి, ఎల్ఎస్ రావు, డీజే సింహా, కె.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

బసవేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

ప్రత్తిపాడు రూరల్: రాచపల్లిలోని అపిత కుచాంబ సమేత అరుణాచలేశ్వరస్వామి దేవస్థానంలో కొలువైన బసవేశ్వరస్వామికి గురువారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కాకినాడకు చెందిన వట్టూరి లక్ష్మణరావు, రాణి దంపతులు 21 రకాల ద్రవ్యాలతో మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం, సామూహిక అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక, పరిసర గ్రామాలకు చెందిన భక్తులు స్వామి వారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌ను తొలగించాలని వినతి

కోటనందూరు: అర్హత లేని వ్యక్తికి ఫీల్డ్ అసిస్టెంట్ బాధ్యతలు ఎలా అప్పగించారని సర్పంచ్ లెక్కల ఉపేంద్ర, వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా తుని నియోజకవర్గ అధ్యక్షుడు లెక్కల భాస్కర్, మాజీ సొసైటీ అధ్యక్షుడు గొర్లి రామచంద్రరావు ప్రశ్నించారు. స్థానిక ఎంపీడీఓ వెంకటనారాయణకు బుధవారం ఆ మేరకు వినతిపత్రం అందజేశారు. గ్రామంలో అనేక సంవత్సరాలుగా పని చేస్తున్న గాడి నాగ వెంకట గణేష్ రికార్డులో కొసాగుతున్నా, కనీస అర్హత లేని గుడివాడ రాజబాబు అనే వ్యక్తికి ఫీల్డ్ అసిస్టెంట్ బాధ్యతలు అప్పగించారని వివరించారు. ప్రస్తుతం ఫీల్డ్ అసిస్టెంటుగా కొనసాగుతున్న రాజబాబు పనికి రానివాళ్లకు మస్తర్లు వేసి నిజమైన కూలీలకు అన్యాయం చేస్తున్నాడని ఆరోపించారు. అర్హత లేని రాజబాబును విధుల నుంచి తప్పించాలని విజ్ఞప్తి చేశారు.

వరి, మొక్కజొన్న పంటల పరిశీలన

గోకవరం: ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలో కృష్ణునిపాలెం, తంటికొండ, కొత్తపల్లి గ్రామాల్లో పాక్షికంగా దెబ్బతిన్న వరి, మొక్కజొన్న పంటలను ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు, వ్యవసాయశాఖ అధికారులు గురువారం పరిశీలించారు. యాజమాన్య పద్ధతులతో పంటను రక్షించుకోవచ్చని తూర్పు గోదావరి జిల్లా ముఖ్య వ్యవసాయ అధికారి ఎస్.మాధవరావు రైతులకు సూచించారు. ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త, కోఆర్డినేటర్ చల్లా వెంకట నరసింహారావు మాట్లాడుతూ వరి పంట పూర్తిగా నేలనంటి, కోత దశకు చేరుకుంటే కోతలు కోసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కోరుకొండ ఏడీఏ మల్లికార్జునరావు, ఏఓ రాజేశ్వరి, రైతులు పాల్గొన్నారు.

నవోదయకు విద్యార్థుల ఎంపిక



ఉత్తరకంచిలో సాయిశ్రీని అభినందిస్తున్న కరస్పాండెంట్ వెంకటేశ్వరరావు తదితరులు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని పలువురు విద్యార్థులు జవహర్ నవోదయ ప్రవేశ పరీక్షల్లో ప్రతిభ చూపి ఆరో తరగతిలో ప్రవేశానికి ఎంపికయ్యారు. మండలంలోని ఉత్తరకంచి ఆక్స్‌ఫర్డ్ స్కూల్‌లో శిక్షణ పొందిన వారిలో 16 మంది నవోదయకు ఎంపికయ్యారు. ఈ విషయాన్ని స్కూల్ కరస్పాండెంట్ దంటా వెంకటేశ్వరరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపికైన వారిలో లంపకలోవ గ్రామానికి చెందిన బొమ్మనబోయిన సాయిశ్రీ కూడా ఉందన్నారు. కాగా సాయిశ్రీని ఉపాధ్యాయులు అభినందించారు.



ఏలేశ్వరంలో మోహనసాయికీర్తనను అభినందిస్తున్న ఎంఈఓలు అబ్బాయి, వరలక్ష్మి

సాయికీర్తనకు అభినందనలు

ఏలేశ్వరం: నవోదయలో ప్రవేశానికి ఎంపికైన కర్రోతు మోహన సాయికీర్తనను పట్టణంలో గురువారం ఎంఈఓలు బి. అబ్బాయి, కె.వరలక్ష్మి అభినందించారు. యర్రవరంలోని న్యూకాలనీ ఎంపీపీ స్కూల్‌లో 5వ తరగతి చదువుతున్న సాయికీర్తన నవోదయ ప్రవేశ పరీక్షలో ప్రతిభ చూపి 6 తరగతిలో ప్రవేశానికి ఎంపికైంది. ఈ సందర్భంగా ఎంఈఓలు ఆమెను అభినందించారు. ప్రస్తుతం విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలల వైపు ఆకర్షితువుతున్న ఈ రోజుల్లో తాను పని చేస్తున్న పాఠశాలలోనే తన కుమార్తె సాయికీర్తనను చదివించి నవోదయ ఎంపికలో ప్రధాన పాత్ర పోషించిన అదే పాఠశాల ఉపాధ్యాయిని కె.దేవదేవిని అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఎం.సత్యవేణి, యూటీఎఫ్ నాయకులు జట్ల సోమరాజు, శిడగం సంజీవి, కడింశెట్టి రవి తదితరులు పాల్గొన్నారు.



నీలాద్రిరావుపేటలో విద్యార్థిని అభినందిస్తున్న మేనేజింగ్ డైరెక్టర్

గండేపల్లి: మండలంలోని నీలాద్రిరావుపేటకు సహస్ర విద్యానికేతన్‌కు చెందిన విద్యార్థి నవోదయ ప్రవేశ పరీక్షల్లో ప్రతిభ చూపాడు. జగ్గంపేట మండలం రామవరానికి చెందిన సీహెచ్ హరివెంకట చరణ్ నవోదయ ప్రవేశ పరీక్షల్లో ప్రతిభ చూపి 9వ తరగతిలో ప్రవేశానికి అర్హత సాధించినట్టు విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ కందుల మణికంఠ కుమార్ తెలిపారు. హరివెంకట చరణ్‌ను ఉపాధ్యాయులు అభినందించారు.